గిద్దలూరులో చైన్ స్నాచింగ్

గిద్దలూరు రూరల్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లిన సంఘటన గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని నంద్యాలరోడ్డులో గల జగనన్న కాలనీ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న నారాయణమ్మ అనే మహిళ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. వస్తువులు కొనుగోలు చేసిన సదరు దుండగుడు ఆమెతో మాటలు కలిపి హఠాత్తుగా మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయాడు. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.5 లక్షలకుపైగా నష్టం



కాలిపోతున్న పొగాకు బ్యారన్

వెలిగండ్ల (కనిగిరి రూరల్): ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం తెల్లవారుజామున వెలిగండ్ల మండలంలోని పాపిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మారం వెంకట సుబ్బారెడ్డి బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు అల్లిక కర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి బంగారు బాబు తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికి బ్యారన్‌లో ఆకు, కర్ర, టైర్లు తదితర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వెంకట సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

లారీని ఢీకొని యువకుడు దుర్మరణం





ప్రమాదంలో మృతి చెందిన మోహన్ వంశీ కృష్ణ
ఇన్‌సెట్‌లో మోహన్ వంశీ కృష్ణ(ఫైల్)





మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివ
ఇన్‌సెట్‌లో మృతుడు వేమా నాగార్జున(ఫైల్)

సింగరాయకొండ: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సింగరాయకొండలోని కలికవాయ ఫ్లైఓవర్ దిగువన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బాలయోగినగర్‌కు చెందిన కూరపాటి మోహన్ వంశీకృష్ణ(23) కందుకూరులోని వివేకానంద కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయంలో కె.బిట్రగుంట వద్ద గల పాల ఫ్యాక్టరీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పాల ఫ్యాక్టరీకి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కలికవాయ ఫ్లైఓవర్ దిగువనఆగి ఉన్న లారీని వెనుక నుంచి వంశీ ఢీకొట్టాడు. పంక్చరైన టైరు మార్చుకునేందుకు రోడ్డు మార్జిన్‌లో లారీని నిలపగా వేగంగా వెళ్తున్న క్రమంలో వంశీ గమనించకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా, తల్లి నాగమణి స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. టంగుటూరు హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరో యువకుడు..

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని బోదనంపాడు సమీపంలో బందిళ్ల బావి వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివ కథనం ప్రకారం.. బోదనంపాడు గ్రామానికి చెందిన వేమా నాగార్జున(32) వ్యక్తిగత పని నిమిత్తం తన బైక్‌పై దర్శికి బయలుదేరాడు. గ్రామ శివారులోని బందిళ్ల బావి వద్ద బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి హద్దురాయిని ఢీకొట్టాడు. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఉంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత



విద్యార్థినితో ఆల్బెండజోల్ మింగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నపుడే చదువుపై ఏకాగ్రత సాధ్యమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బాలబాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 19 ఏళ్లలోపు విద్యార్థులు 5,96,751 మంది ఉండగా 6,80,000 మాత్రలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. భోజనానికి ముందు, కాలకృత్యాల తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతుల శుభ్రత విధానంపై అవగాహన కల్పించారు. అనివార్య కారణాలతో సోమవారం ఆల్బెండోజోల్ మాత్రలు మింగని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ ఎ.కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ వీకే గీతాలక్ష్మి, వైద్యులు పద్మజ, వాణిశ్రీ, ఖాశిం, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 69 ఫిర్యాదులు

ఒంగోలు సబర్బన్: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 69 మంది బాధితులు ఎస్పీ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఒంగోలు నగర శివారులోని కార్గిల్ పెట్రోల్ బంకు ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న వైద్యశాలకు ఆనుకుని ఉన్న తమ ప్లాట్లను కొందరు తమవి అంటూ బెదిరిస్తున్నారని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పలగాని రామసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులం కలిసి ప్లాట్లు కొనుగోలు చేయగా అమ్మిన వ్యక్తి డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి వేధిస్తున్నాడని వాపోయారు. 30 శాతం ఆదాయం వస్తుందని ఓ యాప్ ద్వారా ఆశ చూపి విడతలవారీగా రూ.11.80 లక్షలు తీసుకుని మోసం చేశారని ఒంగోలు బాలాజీ నగర్‌కు చెందిన వ్యక్తి వాపోయాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట పరిధిలో త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భర్త–అత్తారింటి వేధింపులు, చీటింగ్, ఉద్యోగాల పేరుతో మోసం, భూ వివాదాలే అధికంగా ఉన్నాయి.

రైతులు విశిష్ట గుర్తింపు కార్డులు తీసుకోవాలి

పెద్దదోర్నాల: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ తెలిపారు. పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల రాయితీలు పొందాలంటే ఈ 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు.

తాళ్లూరు: మండలంలోని ప్రతి రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య యూనిక్ ఐడీ,ఆధార్ కార్డు తరహాలో అందిస్తోందని, సొంత భూములు కలిగిన ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే వివిధ పథకాల లబ్ధి పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్ నెంబర్ తీసుకొని వ్యవసాయ సహాయకుడిని కలిసి నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పుల్లలచెరువు: ఏపీ ఫార్మర్ పోర్టల్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. ఆమె సోమవారం మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పని సరిగా ఏపీ ఫార్మర్ పోర్టల్లో రిజిస్ట్రేషనై ఉండాలని తెలిపారు. సొంత భూమి కలిగిన రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం నుంచి ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. రైతుకు చెందిన పట్టాదారు పాసపుస్తకం, ఆధార్‌కార్డును తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్తే వ్యవసాయ సహాయకులు పోర్టల్‌లో వివరాలు పొందుపరిచి యూనిక్ నెంబర్ ఇస్తారని తెలిపారు. దీంతో ప్రభుత్వం అందించే రైతు భరోసా, యంత్ర పరికరాలు, సబ్సిడీపై ఎరువులు, రుణమాఫీ, ధాన్యం సేకరణ వంటి సేవలు అందిపుచ్చుకోవచ్చని స్పష్టం చేశారు. రైతులందరూ ఈ సేవలను విధిగి వినియోగంచుకోవాలని కోరారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

తర్లుపాడు: తర్లుపాడులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. 13న కల్యాణోత్సవం, 14న సింహ వాహనం, 15న శేషవాహనం, 16న హనుమంత వాహనం, 17న గరుడోత్సవం, 18న గజవాహనంపై స్వామివారి నగరోత్సవం, 19న రథోత్సవం నిర్వహిస్తామని, 20న దోపు ఉత్సవం, 21న తీర్థావళి, నాగావళి, పూర్ణాహుతి, వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కలెక్టరమ్మా.. కరుణ చూపమ్మా!

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: రాష్ట్రంలో పూర్తిగా వెనకబడిన ప్రాంతం యర్రగొండపాలెం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని కోరుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ వినతి పత్రాలు అందజేశారు. ఆదివారం ఒంగోలులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన కలెక్టర్‌ను సంబోధిస్తూ పలు సమస్యలతో కూడిన అర్జీలను జేసీ గోపాలకృష్ణకు అందచేశారు. నియోజకవర్గంలోని ప్రజలు తీవ్ర కరువు కాటకాలతో అల్లాడి పోతున్నారని, సకాలంలో వర్షాలు కురవక పోవడంతో కనీసం తాగు నీటికి కూడా నోచుకోవడం లేదని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. వేసవి కాలం సమీపించక ముందే గ్రామీణ ప్రాంతాల ప్రజలు సుదూర ప్రాంతాల్లో ఉన్న పొలాల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా నియోజకవర్గంలోని 25 గ్రామాల ప్రజలు తీవ్ర నీటి సమస్య ఎదుర్కొంటున్నారని, వెంటనే మండలానికి 25 డీప్‌వెల్ బోర్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలెం నుంచి వివిధ పనుల కోసం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లేందుకు నేరుగా బస్సు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే నియోజకవర్గ కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకంకు ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు నరకయాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెంటనే స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గ కేంద్రానికి దాదాపు 62 కిలో మీటర్ల దూరంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల గిరిజన గూడెం వాసులు తాము పండించిన పంటలను మార్కెటింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పంటలను ట్రాన్స్‌పోర్ట్ చేసుకునేందుకు అటవీ శాఖాధికారులు అనుమతి ఇవ్వడం లేదని, వెంటనే పాలుట్ల నుంచి పంటలను రవాణా చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇంటర్నల్ రోడ్లు లేక ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా పుల్లలచెరువు నుంచి గంగవరం, యర్రగొండపాలెం నుంచి దువ్వలి, ఐనముక్కల గ్రామం నుంచి మెయిన్ రోడ్డు వరకు, దువ్వలి నుంచి లేళ్లపల్లి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. నల్లమల అటవీ ప్రాంతంలో జీవిస్తున్న చెంచు గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ భూముల్లో 179 పక్కా గృహాలు మంజూరు చేశారని, అందులో 24 గృహాలు నిర్మించుకున్నారని, మిగిలిన గృహాలు నిర్మించుకునేందుకు అటవీశాఖాధికారులు అభ్యంతరాలు తెలుపుతున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించి గిరిజనులు గృహాలు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెం పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

త్రిపురాంబ అమ్మవారికి సారె



అమ్మవారి ప్రతిమతో త్రిపురాంతకం బయల్దేరిన మహిళలు

యర్రగొండపాలెం: మాఘమాసం సందర్భంగా స్థానిక శ్రీభ్రమరాంబిక సేవా సమితి ఆధ్వర్యంలో త్రిపురాంతకంలో వెలసిన భ్రమరాంబిక అమ్మవారికి సోమవారం సారె సమర్పించారు. ఈ మేరకు మహిళా భక్తులు స్థానిక కొలుకుల రోడ్డు నుంచి అమ్మవారిని ఊరేగించుకుంటూ పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. తొలుత బాల త్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో గాజుల ఉత్సవం జరిపి పసుపు, కుంకుమలు సమర్పించారు. అనంతరం కొండపై వెలసిన త్రిపురాంబ అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీభ్రమరాంబిక సేవాసమితి అధ్యక్షురాలు ఎంవీఎస్ మహాలక్ష్మి, సభ్యులు విమల, గీతారెడ్డి, కేశవర్ధిని, మాధవి, రఘుబాబు పాల్గొన్నారు.

దొనకొండ ఎస్‌ఐగా త్యాగరాజు



దొనకొండ: స్థానిక పోలీసుస్టేషన్ నూతన ఎస్‌ఐగా టి.త్యాగరాజు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఒంగోలు ఒన్‌టౌన్ నుంచి బదిలీపై దొనకొండకు వచ్చారు. గ్రామాల్లోని ప్రజలకు రక్షణ కల్పిస్తానని ఎస్‌ఐ తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన మారమ్మ

పెద్దదోర్నాల: కోతులు దాడి చేయడంతో అరుగు నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలోని తిమ్మాపురంలో జరిగింది. ఈ సంఘటనలో కర్నూల్ జిల్లా కోసగి గ్రామానికి చెందిన మారమ్మ తీవ్రంగా గాయపడింది. సమాచారం అందటంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రురాలిని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. ఈ క్రమంలో క్షతగాత్రురాలికి ముక్కు, చెవుల నుంచి రక్తస్రావం కావటంతో హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కర్నూల్ జిల్లా కోసగి గ్రామానికి చెందిన దంపతులు పరమేష్, మారమ్మలు కూలి పనులకు వెళ్తుండేవారు. మండలంలోని తిమ్మాపురంలో జరిగే మిర్చి కోతలకు దంపతులు వచ్చారు.

మొదటి ప్రాధాన్యం ఆరోగ్యానికి ఇవ్వాలి



విద్యార్థినికి మాత్రలు వేస్తున్న డాక్టర్ బ్లెస్సీ



పెద్దదోర్నాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



దర్శి: విద్యార్థికి నులిపురుగుల మందులు వేస్తున్న ఎన్‌వీ రమణ

దర్శి: విద్యార్థులు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని చందలూరు మెడికల్ అధికారి డాక్టర్ బ్లెస్సీ సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చందలూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ టాబ్లెట్‌లు మింగించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు రాకుండా పలు సూచనలు సలహాలు అందజేశారు. బ్లెస్సీ మాట్లాడుతూ గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బయట తిరిగేటప్పుడు బూట్లు లేదా చెప్పులు వేసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదని, మరుగుదొడ్లను మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. తినే ఆహారం మీద ఎప్పటికప్పుడు మూతలు కప్పి పెట్టాలన్నారు. తినకముందు, తిన్న తర్వాత, మరుగుదొడ్డి ఉపయోగించుకున్న తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు జి.గురుప్రసాద్, వైద్యులు సురేఖ, సీహెచ్‌ఓ దయామణి, ల్యాబ్ టెక్నీషియన్ వసంతకుమార్, ఏఎన్‌ఎం లీలా పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, సబ్ యూనిట్ అధికారి రమేష్‌బాబు, సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, భరత్ భూషణ్, వెంకటేశ్వరరెడ్డి, నాగలక్ష్మి, ఏఎన్‌యం రాజెమ్మ పాల్గొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని 412 అంగన్‌వాడీ కేంద్రంలో 5 సంవత్సరం లోపు చిన్నారులకు అల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. సూపర్‌వైజర్ సూర్యకుమారి, పద్మావతి, అంగన్‌వాడి కార్యకర్త మల్లేశ్వరి పాల్గొన్నారు.

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ మాట్లాడుతూ నులిపురుగులతో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక, మానసిక అభివృద్ధి బలహీనపడటం జరుగుతుందన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వారు ఈ మాత్రలు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.ప్రభుదాస్, రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ వి.సుజాత, ఎం.రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కురిచేడు: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో 98.5 శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి పి.ప్రవీణ్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్‌బెండాజోల్ 400 మిగ్రా వేయించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 9189 మంది చిన్నారులకు గాను 9052 మందికి మింగించినట్లు చెప్పారు. మిగిలిన చిన్నారులకు ఈ నెల 17న మిగిస్తామని పేర్కొన్నారు. మరో డాక్టర్ వి. రవితేజ కుమార్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు

కురిచేడు: మండలంలోని ఆవులమంద పంచాయతీ ప్రతిజ్ఞాపురి కాలనీకి చెందిన బొజ్జా హరేంద్ర (27) ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హరేంద్రకు 10 సంవత్సరాల క్రితం భవానీ తో వివాహమైంది. కొంతకాలం సజావుగా సాగిన కాపురంలో భార్యాభర్తల మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 1వ తేదీన దంపతులు గొడవపడటంతో హరేంద్ర పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని గుంటూరు జనరల్ ఆస్పత్రిలో వైద్య చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆస్పత్రిలో మృతుడి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ తెలిపారు. మృతునికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు.

రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

పుల్లలచెరువు: రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.జానకి రఘు విమర్శించారు. నూతనంగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన జానకి రఘును వైఎస్సార్ సీపీ మండల నాయకులు సోమవారం పుల్లలచెరువులో ఘనంగా సన్మానించారు. అనంతరం రఘు విలేకరులతో మాట్లాడుతూ జగనన్న తన పాలనలో వ్యవసాయానికి ఎన్నో పథకాలు, రాయితీలు అందించి రైతులను రాజుగా నిలిపారన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇలా అన్నింటినీ తొలగిస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయానికి పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. రాత్రి


రఘును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వేళల్లో కరెంట్ ఇవ్వడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కింద తప్పకుండా రైతుల ఖాతాలకు డబ్బు జమయ్యేదన్నారు. కూటమి ప్రభుత్వ పైసా సాయం అందించడం లేదని మండిపడ్డారు. జగనన్న ఆర్బీకేల ద్వారా పంట ఉత్పత్తులు మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు దళారుల బెడద లేకుండా చేశారన్నారు. జగనన్న ఉచితంగా పంటల బీమా అందిస్తే చంద్రబాబు బీమా ప్రీమియం భారాన్ని రైతులపై వేశారన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో వచ్చే రోజుల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు న్యాయం చేయడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు ఎ.కోటిరెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీ రాములు, జిల్లా సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ భూమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు ఉమామహేశ్వరెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, ఎ.శివారెడ్డి, కె.ఏడుకొండలు, దినేష్, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, ఆవుల చెంచురెడ్డి, వెంకటేశ్వర్లు, జి.అంజి, డి.హనుమంతరావు, మూర్తెయ్య, బీసీ మండల అధ్యక్షురాలు రమణమ్మ పాల్గొన్నారు.

కల్తీ దాణా తయారు చేస్తే చర్యలు

ముండ్లమూరు (దర్శి): కల్తీ దాణా తాయరు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు హెచ్చరించారు. మండలంలోని వేంపాడులో ఎటువంటి అనుమతులు లేకుండా కల్తీ పశువుల దాణా (తవుడు) తయారు చేస్తున్నారనే అభియోగంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. వారితో పాటు పశు సంవర్థక శాఖ, లీగల్ మెట్రాలజీ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. తొలుత గోడౌన్‌ను తనిఖీ చేశారు. పశు సంవర్థక శాఖ అధికారులు అక్కడ తయారు చేస్తున్న దాణాను సేకరించారు. విజయవాడకు చెందిన వీబీఆర్ఐ ల్యాబ్‌కు పంపించారు. లీగల్ మెట్రాలజీ అధికారులు అక్కడ ఉన్న ఎలక్ట్రానిక్ కాటాను తనిఖీ చేశారు. ముద్రలు లేక పోవడంతో కాటాను సీజ్ చేసి తదుపరి చర్యల కోసం తమ కార్యాలయానికి పంపారు. కూలీలకు కనీస వేతనం ఇవ్వడం


గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

లేదని, సంస్థకు సంబంధించి రికార్డులు లేవని లేబర్ డిపార్ట్ అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామని చెప్పారు. ఎవరైనా కల్తీ చేసి అమ్మకాలు జరిపితే తమకు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. డీసీటీఓ రామారావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఏపీహెచ్ ఏడీ పురుషోత్తమరాజు, పశు వైద్యాధికారి ఎం. విజయలక్ష్మి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మోహిస్సిన్, అసిస్టెంట్ లేబర్ అధికారి టి.మధుబాబు పాల్గొన్నారు.